# చదువు

శ్రీగిరిపాడు క్యాంపు నుండి తిరిగి వచ్చేటప్పటికి, సాయంత్రం ఆరున్నర గంటలయ్యింది. జీపును ఇంటికేసి త్రిప్పబోయిన డ్రైవరుతో, సరాసరి ఆఫీసుకే పోనిమ్మన్నాను. నిన్న సాయంత్రం ఫోనులో, వెంటనే శ్రీగిరిపాడు గ్రామాన్ని 'విజిట్' చేసి, అక్కడి 'టెనెంట్స్' సొసైటీ భూముల వివాదంపై విచారణ జరిపి, రిపోర్టు పంపించవలసినదిగా ఆదేశాలు వచ్చాయి రాజధాని నుండి. ఈనాటి సాయంత్రానికల్లా నివేదిక మంత్రిగారికి చేరాలట.

నూట ఇరవయి కిలోమీటర్ల దూరాన ఉన్న శ్రీగిరిపాడు గ్రామానికి క్రిందటి సాయంత్రమే బయలుదేరి వెళ్లాను జీపులో రాత్రి 9 గంటలకు అక్కడకు చేరి, రాత్రికి రాత్రే వివరాలు సేకరించటం ప్రారంభించాను.

బ్రిటిషువారి హయాములో, 60 సంవత్సరాల క్రితం, దళితులకొక 'టెనెంట్సు కోపరేటివ్స్ సంఘాన్ని' ఏర్పరచి, ఆ గ్రామాన్ని దక్షిణంగా అంటిపెట్టుకొని వున్న బంజరు భూములను, దానికి యిచ్చింది ఆనాటి ప్రభుత్వం. కుటుంబానికో అయిదు ఎకరాలుగా, ఆ భూములను ఆ సంఘ సభ్యులకు పంచి, సేద్యం చేసికోమన్నారు.

నీటి వసతి లేక రాయి, రప్పలతో కూడిన ఆ మెరక భూములలో చాలా భాగం ఏమీ పండేది కాదు. ఆ మెరకలు తీయించుకొని భూములను పాటుకు తెచ్చుకునే ఆర్థిక స్తోమతు లేక చాలామంది దళితులు ఆ పొలాలను ఆ గ్రామ



భూస్వాములకు పదికి, పరకకు కౌళ్ళకిచ్చుకొన్నారు.

చెల్లి పెళ్ళికో, పిల్ల కాన్పుకో ఆ భూస్వాముల చెంత చేసిన అప్పులు, వడ్డీల, చక్రవడ్డీల రూపాలలో పెరుగుతూ వుండటంతో, ఆ దళితుల భూములు

చెల్లుపద్దుల్లా భూస్వాముల చేతుల్లోనే మిగిలిపోయాయి.

ఇక మామూలు కథే!

ఏ భూములకు తాము అధిపతులమో, ఆ భూములలోనే, తాము కూలీలుగా మారిపోయారు దళితులు. వారి మామూలు బానిస బ్రతుకులే వారికి మిగిలాయి.

అలాంటిది అక్కడో ప్రాజెక్టు రావటంతో, ఆ భూములన్నీ మాగాణి సేద్యానికి అనువుగా మారిపోయాయి. ఉడతలు గ్రుడ్లు పెట్టే ఆ భూములు సస్యశ్యామలాలై బంగారాన్ని పండించటం ప్రారంభించాయి.

ఆ దళితుల తాలూకు మూడవ తరం కుర్రకారు కొందరికి, ఆ పొలాలు తమవని, వాటిని స్వాధీనపరచుకొనే హక్కు తమకుందని సహకార సంఘాల భూములను ఎవరూ కొనరాదనే చట్టం వుందని తెలిసిపోయింది. వారందరు సంఘటితమై, తమ భూములను తమకు స్వాధీనం చేయమని ఆ భూస్వాములకు ఎదురు తిరిగారు.

పర్యవసానంగా భూస్వాముల దౌర్జన్యం, దళితుల తిరుగుబాటు. ఘర్షణలు. నిరసన శిబిరాలు. ఇదంతా వార్తాపత్రికలలో పతాక శీర్షికలలో చోటు చేసుకోవటం జరిగాయి. ప్రభుత్వం "విచారణ జరిపించి నివేదిక తెప్పిస్తామని" ప్రకటించింది. అది పూర్వకథ.

నా విచారణ, విషయ సేకరణ పూర్తి అయ్యేసరికి మరునాడు మధ్యాహ్నం అయింది. వెంటనే బయలుదేరి తిరిగి వచ్చాను. ఆఫీసులో సూపరింటెండెంటు, సెక్షన్ గుమాస్తా, స్టెనో నా రాక కోసమే ఎదురుచూస్తూ వున్నారు.

"సార్! కమీషనరుగారి ఆఫీసునుండి రెండు సార్లు ఫోనొచ్చింది. అడిషనల్ రిజిస్ట్రారుగారు మన రిపోర్టు కోసం తొందరపడుతున్నారు. ఎంత రాత్రైనా వారు ఆఫీసులోనే వుంటారుట. రాత్రికి రాత్రే స్పెషల్ మెసెంజరు ద్వారా రిపోర్టు పంపించమన్నారు. మినిష్టరుగారు చాలా తొందర చేస్తున్నారట" చెప్పాడు సూపరింటెండెంటు.

వెంటనే స్టెనోకు రిపోర్టు డిక్టేట్ చేయటం ప్రారంభించాను.

"సార్! మిమ్మల్ని చూడాలంట, ఎవరో ప్రొద్దుననగా వచ్చారు" అన్నాడు అటెండరు కృష్ణ లోనికి వచ్చి.

"నో... నాట్ నౌ... రేపు రమ్మను" అన్నాను.

అంతలోనే, ఫోన్‌కాల్ రాజధాని నుండి - అడిషనల్ రిజిస్ట్రారుగారు.

"సార్! నేను ప్రభాకరాన్ని" అన్నాను.

"వాట్ ప్రభాకర్... వాటార్యూ డూయింగ్ అయిసే" అడిషినల్ గారి గొంతు అధికారాన్ని, ఆందోళనను పులుముకొని వినిపించింది.

"నా ఎంక్వయిరి పూర్తి అయింది సర్! రిపోర్టు పూర్తి కావస్తోంది. ఈ రాత్రికే స్పెషల్ మెసెంజరు ద్వారా పంపుతున్నాను".

"నో... నో చాలా ఆలస్యమయింది. ఈ సాయంత్రానికే రిపోర్టు మినిష్టరుగారికి యిస్తామని ప్రామిస్ చేశారు కమీషనర్‌గారు. చాలా డిలే అయింది. యు విల్ బి టేకెన్ టు టాస్క్".

"క్షమించాలి... మీ మెసేజ్ వచ్చిన వెంటనే మూవ్ అయ్యాను. ఆ గ్రామం చాలా దూరం. అడవి ప్రాంతం. 50 కిలోమీటర్లు. సరైన రోడ్డు లేదు. ప్రయాణం అతి కష్టమైంది, తీరా అక్కడికి వెళితే, ఆ గ్రామ పరిస్థితి చాలా భీతావహంగా వుంది. ఎలాగో, అతి కష్టం మీద రిపోర్టు తయారుచేయగల్గాను".

"మిస్టర్ ప్రభాకర్! నో బడీ ఈజ్ రెడి టు హియర్ యువర్ ఎక్స్‌ప్లనేషన్స్ ఎనివే... తెల్లవారేసరికి నీ రిపోర్టు మంత్రిగారి ముందుండాలి" - ఫోను పెట్టేశారు అటువేపు నుండి.

రిపోర్టు డిక్టేట్ చేయటం పూర్తి అయ్యేసరికి మరో రెండు గంటలు పట్టింది. అది టైపు అవుతుండగా ఫోను మ్రోగింది. మినిష్టరుగారి పి.ఎ. ఫోనులో- "ఎవరండీ... శ్రీగిరిపాడు రిపోర్టు రెడీనా?" ప్రశ్నించారు.

"యస్ సర్! టైపవుతోంది."

"మీ ఫైండింగ్స్ ఏమిటి?"

"అదే సార్. ఆ భూములు దళితులవి. భూస్వాములు, తమ వద్ద దళితులు తర తరాలుగా చేసిన అప్పుల క్రింద తమకా భూములు ధారాదత్తమయ్యాయనటం న్యాయం కాదు. చట్టం ఒప్పుకోదు. డాక్యుమెంటరీ సాక్ష్యాధారాలతో రిపోర్టు పంపు తున్నాను-"

"ఆగండి.. మినిష్టరుగారితో మాట్లాడండి."

అయిదు నిమిషాల తరువాత ఫోనులో మంత్రిగారి కంఠం - "మీ నియోజక వర్గపు యం.యల్.ఎ గారు వున్నారిక్కడే.. వారితో మాట్లాడండి" అంటూ.

ఫోను యం.యల్.ఎ.గారి చేతి కెళ్ళిందిలావుంది.

"ఇదుగో, డి.సి.ఓ గారేనా... ఆ భూములు దళితులవెలా అవుతావయ్యా? ఏనాడో బ్రిటీషువాడిస్తే... ఇంకా బ్రిటీషోడి చట్టమేనా? ఆ టెనెంట్సు సొసైటీ చాలా కాలం క్రిందే మూతపడ్డది. ఆ భూములు రైతుల హక్కు భుక్తాలయ్ పోయినయ్ - అట్టుండాల రిపోర్టు. తిప్పి రాయండి. ఇది మినిష్టరుగారి మాటే"

మళ్లీ ఫోను మినిష్టర్‌గారు తీసికొన్నారు.

"రేపు యం.యల్.ఎ.గారు వస్తారక్కడికి. వారిని సంప్రదించి రిపోర్టు తయారుచేయండి. ఆయన ప్రజాప్రతినిధి; మర్చిపోకండి, రిపోర్టు రెండు మూడు రోజులు ఆలస్యమైనా ఫరవాలేదు!"

నిర్ఘాంతపోయాను.

"కాల్ అయిపోయింది ప్లీజ్ - " అనే ఆపరేటర్ హెచ్చరికతో, చేతిలో అలాగే వున్న ఫోనును క్రెడిల్ చేసాను.

"బీదల కోసం", "దళితుల సౌభాగ్యం కోసం" అని నినాదాలిచ్చి అధికారం లోకి వచ్చిన ప్రభుత్వం యిది!

అప్పటికి రాత్రి 10 గంటలయింది. గత 24 గంటలుగా పచ్చి మంచినీళ్ళైనా ముట్టుకోలేదు. ఆకలివేస్తోంది. ఇంటికి వెళ్ళడానికి లేస్తూ "డ్రైవరున్నాడా?" అని వాకబు చేసాను.

"ఉన్నాడు కాని సార్" ఆగిపోయాడు అటెండరు కృష్ణ

"ఏమిటి?"

"ప్రొద్దుననగా వచ్చారు సార్, ఆయన. అలాగే మీకోసం వేచివున్నారు...."

"రేపు రమ్మని చెప్పాకదా" అన్నాను.

"అదే చెప్పాం సార్...కాని 'ఎంత రాత్రయినా వుంటాను' అంటూ వుండిపోయారు. చాలా పెద్దాయన పాపం..."

'చాలా పెద్దాయన పాపం!' అన్న కృష్ణ మాటలు విన్నాక గుర్తుకొచ్చింది. సాయంత్రం ఆఫీసులోకి వస్తూ వుండగా ఎవరో విజిటర్సు రూములో కూర్చొని వున్నట్లు - వయోవృద్ధుడిలా వున్నట్లు.

లేచినవాణ్ణి మళ్ళీ కూర్చొంటూ, "రమ్మను" అన్నాను.

బట్టలు బాగా మాసి వున్నాయి. పొడుగ్గా ఎదిగిన తెల్లటి గడ్డం. 70 ఏళ్ళుంటాయి. వచ్చి నా కెదురుగా కుర్చీలో కూర్చొంటూ చిన్నపాటి చిరునవ్వుతో, నన్నంతా ఎగాదిగా చూచారాయన.

"చెప్పండి" అన్నాను.

"గుర్తు పట్టలేదు కదూ.. చాలా కాలం అయింది. దగ్గర దగ్గర ఇరవయ్యేళ్ళను కొంటాను" అన్నారు.

ఎక్కడో జ్ఞాపకాల పొరల వెనుకదాగి వున్న పరిచిత స్వరం అది. స్మృతుల తలుపులను తట్టుతోన్న రూపం! అలా చూస్తూ వుండిపోయాను కొన్ని క్షణాలు.

"క్షమించండి, మిమ్మల్ని...."

"క్షమించాల్సిందేమీ లేదు. ఈ రూపంలో ఆనాటి మీ సంగీతం మాస్టార్ని పోల్చుకోలేకపోవటం న్యాయమే! నేను మీ చంద్రమౌళి మాస్టారిని-"

"మాస్టారూ!" అంటూ, సంభ్రమాశ్చర్యాలు ముంచెత్తగా, అసంకల్పంగా నా సీటు నుండి, లేచి, మాస్టారి ముందుకొచ్చి, పాదాలనంటి నమస్కరించాను. నా భుజాలను రెండు చేతులతోటీ పొదవి పట్టుకొని లేపి, నాకేసి ఎంతో తృప్తిగా చూస్తున్న మాస్టారి కనులలో ఆనందాశ్రువులు.

"ప్రొద్దుట నుండి, నా కోసం వేచి వున్నారా! మీ కొకరి అనుమతి ఎందుకు - నేరుగా వచ్చివుండాల్సింది. క్షమించండి" అన్నాను.

"నీ వున్న స్థితిలో పని వత్తిడి గమనించాను. అందుకే..."

"ఇవేవీ, ఇన్నాళ్ళకు దర్శనమిచ్చిన మాస్టారికన్నా గొప్పవి కాదు మాస్టారూ! పదండి ఇంటికి వెళదాం" అంటూ ఫోనెత్తి డయల్ చేశాను ఇంటికి.

ఆ వైపు నుండి, "ఇల్లు జ్ఞాపకం వచ్చిందాండి" అంది కళ్యాణి.

"వచ్చింది. వస్తున్నాను. ఒంటరిగా కాదు సుమా! ఎప్పుడూ చెపుతూ

వుంటానే - మా సంగీతం మాస్టారి గురించి.... వారితో సహా వస్తున్నాను" అన్నాను.

కళ్యాణి ఆశ్చర్యపోయింది.

జీపులో మాస్టారితో సహా ఇంటికి బయలుదేరాను. జీపు బయలు దేరాక "చెప్పండి మాస్టారూ! ఎక్కడ ఉంటున్నారు, ఎలా వుంటున్నారు?" అన్నాను.

"భీమవరం వదలి వేశాక... పుట్టి పెరిగిన 'సాలూరు' చేరాను. అక్కడే వుంటున్నాను. ఎలా వున్నానంటావా, ఇదిగో ఇలా...." అన్నారు.

గుమ్మం దగ్గరగా ఎదురొచ్చి మాస్టారికి నమస్కరించి, సాదరంగా ఆహ్వానించింది కళ్యాణి.

"మాస్టారూ! మీరందించిన వయోలిన్ సంగీతాన్నే, విశాఖలో డాబా గార్డెన్స్‌లో, నా పాటికి నేను ఎక్కడో మేడపై అంతస్థులో కూర్చొని సాధన చేసికొంటున్న రోజులలో ఆ రాగ ప్రస్తారాలను పట్టుకొని ప్రక్కింటి మేడ మీద నుండి ప్రాకి వచ్చి, 'ఫ్యాను' నంటూ మొదలెట్టి ఇల్లాలై కూర్చొంది" అంటూ పరిచయం చేశాను కళ్యాణిని.

"అలా ఏం కాదు మాస్టారూ! మా బామ్మ నేర్పించిన త్యాగరాయస్వామి వారి కీర్తనలను 'హమ్' చేసికొంటూ అమాయకంగా ఆ మేడ మీద తిరుగాడే నన్ను - వయొలిన్‌పై వాటినే మాటి మాటికీ వాయించి వాయించి, ఆ స్వరార్ణవపు మత్తుజల్లి మాయ చేసిందీయనగారే" అంది కళ్యాణి.

"వట్టిది మాస్టారూ! నేనసలు వాయించనే వాయించని 'మరుగేలరా... ఓ రాఘవా....' అనే కృతిని తానే అస్తమానం ఆలపించేది."

మాస్టారు చిరునవ్వుతో మా దంపతులను ఆశీర్వదిస్తున్నట్లే చూచారు.

★ ★ ★

ఇరువది సంవత్సరాలనాటి రోజులు. నాన్నగారు భీమవరంలో తాసిల్దారు చేస్తుండేవారు. నేను విద్యార్థిని. అమ్మ పట్టుదలతో చంద్రమౌళి మాస్టారి దగ్గర వయోలిన్ నేర్చుకోవటం ప్రారంభించాను. నా సహాధ్యాయి రాజశేఖరం కూడా వారి దగ్గరే గాత్ర సంగీతం నేర్చుకొనేవాడు. మాస్టారు ఎంత గొప్పగా పాడేవారో -

అంత గొప్పగా వయోలిన్ వాయించేవారు. వారికి పబ్లిసిటి గిట్టేదికాదు. కచేరీలు చేసేవారు కాదు. పాడుకొనే 'ఆత్మానుభూతి' చాలు నాకు అనేవారు. ఆయనగారు సంగీతపు పాఠాలు చెప్పుకొనే మాస్టారు కాదు. తనకిష్టమైన వాళ్ళకు సంగీతం ఉచితంగా చెప్పేవారు. నాన్నగారికీ, వారికీ వున్న పరిచయం వలన నేను వారికి శిష్యుణ్ణి అయ్యాను. నేను వారి దగ్గర వయోలిన్ నేర్చుకొన్న ఆ నాలుగు సంవత్సరాలలో నేను, రాజశేఖరం మాత్రమే ఆయన శిష్యులం.

సంగీతం చెపుతూ, వింటూ, పాడుతూ ఎంతటి అనుభూతిని పొందేవారో మాస్టారు. ఒక్కొక్కనాడైతే అలా వారు పాడుతూనో, వయొలిన్ వాయిస్తూనో, రాజశేఖరం చేత పాడిస్తూనో, నా చేత వయొలిన్ వాయింపచేస్తూనో, ఏ అర్థరాత్రి వరకో ఆ 'నాదా' నుభూతిలో మునిగిపోయి వుండేవారు.

రాగం, తానం, పల్లవి వయొలిన్‌పై అరమోడ్పు కన్నులతో పల్కిస్తూ రాత్రింబవళ్ళను మరచిపోయేవారు మాస్టారు. సంగీతం ఒక ధ్యానం మాస్టారికి. అది ఒక యోగం, ఒక తపస్సమాధి ఆయనగారికి.

మాస్టారిది విజయనగరం దగ్గర 'సాలూరు'. ఎలా వచ్చారో వచ్చి, భీమవరంలో నివాసం వుండిపోయారు. అత్తవారి ఆస్థికి వారసులుగా వచ్చారనుకొనే వారు.

భీమవరం నుండి నాన్నగారికి బదిలీ అయింది. మాస్టారిగారి దగ్గర సెలవు తీసుకొనటానికి వెళ్ళగా- "ఏదీ ప్రభాకరం.... 'రఘువంశ సుధాంబుధి' ఒక్కసారి వాయించు" అని, నేను వయొలిన్‌పై వాయించగా విని అప్యాయంగా కౌగిలించుకొని వీడ్కోలు చెప్పారు మాస్టారు.

ఆ తరువాత కొద్ది సంవత్సరాలు మాస్టారి యోగక్షేమాలు భీమవరంలోనే కాలేజిలో చదువుతోన్న రాజశేఖరం జాబుల ద్వారా తెలుస్తుండేవి.

మళ్ళీ నేనూ, రాజశేఖరం విశాఖ యూనివర్సిటీలో కలిశాం.

"జానకమ్మగారు అకస్మాత్తుగా చనిపోయారు. మాస్టారి పరిస్థితే మారి పోయింది. వాళ్ళ అబ్బాయి 'నానీ'ని తీసికొని భీమవరం వదలి వెళ్ళిపోయారు మాస్టారు. మా నాన్నగారు వ్యాపార రీత్యా హైద్రాబాద్ చేరారు. ఆ పై మాస్టారి జాడే తెలియలేదు" అంటూ చెప్పాడు రాజశేఖరం విశాఖలో.

★ ★ ★

ఇన్నాళ్ళకు మళ్ళీ మాస్టారు కనిపించారు! మాస్టారికి మేడపై గెస్టు రూములో పక్క ఏర్పాటు చేసింది కళ్యాణి. ఆయనగారి మంచం ప్రక్కనే కూర్చొని కబుర్లు చెప్పుకొన్నాం చాలాసేపు.

జానకమ్మగారు పోవటం విషయం వచ్చింది.

"జానకి అంత తొందరగా నన్ను వదిలి వెళ్ళి పోతుందనుకోలేదు. చిన్నపాటి నలత. రెండు రోజుల జ్వరం అంతే! ఆ రాత్రి ప్రొద్దుపోయాక నన్ను లేపి, 'ఏదండీ... వయొలిన్‌పై 'మరుగేలరా, ఓ రాఘవా' వాయించరూ' అని అడిగింది. 'అలాగే' అంటూ వాయించి వినిపించాను. మళ్ళీ, మళ్ళీ అంటూ ఆ కృతిని వింటూనే జానకి నా కనుమరుగై పోయింది."

మాస్టారి కనులలో, చిక్కటి కన్నీరు.

"నాని... ఏం చేస్తున్నాడు మాస్టారు?" ప్రశ్నించాను.

మాస్టారు నా ప్రశ్నకు సమాధానం యివ్వలేదు. జానకమ్మగారి స్మృతిలోనే వుండిపోయారు.

"అంతవరకు సంగీత ప్రపంచమే కాని, బాహ్య ప్రపంచం నాకు తెలియదు. మొదటిసారిగా జానకి నా ప్రక్కన లేదని తెలుసుకొని మ్రాన్పడిపోయాను. జీవితం చైతన్యరహిత నిశీథిలా అనిపించింది-" ఆగిపోయారు మాస్టారు.

అవునట - విశాఖలో కలిసినపుడు రాజశేఖరం చెప్పాడు - "జానకమ్మగారు పోయిన వార్త తెలిసి రాజశేఖరం వాళ్ళు వెళ్ళేసరికి మాస్టారు ఒంటరిగా ఆమెగారి శవం ప్రక్కనే కూర్చొని వయొలిన్ వాయించుకొంటున్నారట. నాని ఏడ్చి ఏడ్చి ఆయనగారి తొడపై అలా నిద్ర పోతున్నాడట. ఆ తరువాత పన్నెండు దినాలూ అంతేనట. మాస్టారు మౌనంగా ఏదో ప్రపంచంలో వున్నట్లు, ఒంటరిగా ఓ గదిలో కూర్చొని, జానకమ్మగారికి ఇష్టమైన త్యాగరాజ కృతులు, స్వాతి తిరునాళ్ కృతులు, జయదేవ అష్టపదులు వయొలిన్‌పై వాయించుకొంటూ వుండిపోయారట. జానకమ్మగారి అపరకర్మలు నానీపై కర్తృత్వాన్నుంచి ఎవరో దగ్గరి బంధువులు నిర్వర్తించారుట."

"చాలా ప్రొద్దుపోయింది మాస్టారూ! రెస్టు తీసుకొండి" అని చెప్పి మెట్లు దిగుతుండగా గుప్పున జ్ఞాపకానికొచ్చింది.

"అరె! ఎలా మరచాను..." అనుకొంటూ తిరిగి పైకెళ్ళి- "మాస్టారూ! రాజశేఖరం పేరు యిన్నిసార్లు వుచ్చరించి వాణ్ణి గురించి చెప్పటం మరచాను. వాడిక్కడే, ఈ వూరులోనే వున్నాడు. అడిషినల్ సూపర్నిండెంటు ఆఫ్ పోలీసుగా" అన్నాను.

"అవునా!" ఆశ్చర్యపోయాగు మాస్టారు.

"ఉండండి పిలుస్తాను" అని పై నున్న ఫోనెత్తాను. 'ఆర్డర్లీ' ఎవరో "దొరగారు లేరు సార్... ఏ తెల్లవారుజాముకో రావచ్చు" అన్నాడు.

"ప్రొద్దున్నే పిలుద్దాం మాస్టారు" అని చెప్పి క్రిందికి వచ్చేశాను. క్రిందటి రాత్రి క్యాంపులో సరిగా నిద్రలేదేమో బాగా నిద్రపట్టేసింది.

తెల్లగా తెల్లవారిగాని మెలకువరాలేదు. అదీ కళ్యాణి వచ్చి, "లేస్తారా... ఆరు గంటలు కూడా అయింది" అంటూ లేపటంతో.

"మాస్టారు లేచారా?"

"ఎప్పుడో లేచారు. స్నానం చేసి పేపరు చూస్తున్నారు. 'ప్రభాకరం చాలా అలసిపోయాడు - లేపకు' అన్నారు కూడ" అంది కళ్యాణి.

అంతలోనే ఫోను రింగయింది. అందుకొన్నాను.

"అరేయ్ ప్రభూ.. నేను రాజశేఖరాన్ని. ఇంతకుముందే వచ్చాను శ్రీగిరిపాడు నుండి. అక్కడి 'లా అండ్ ఆర్డర్' సిట్యుయేషన్ మీద డి.జి.పి.కి రిపోర్టు పంపాల్సి వుంది. నీవూ అక్కడికి వెళ్ళి వచ్చావటగా - నీ రిపోర్టు ఒకసారి చూడవచ్చా?"

"ఆ చూడవచ్చు.. అసలు రిపోర్టు అంటూ ఒకటి తయారయితే!"

"అదేం?"

"అదంతే... నా నెత్తినా అధికారులు, మంత్రులు, వారి సామంతులూ వున్నారుగా... అదలావుంచు నీకో ప్లెజంటు సర్ ప్రైజ్. వెంటనే వచ్చెయ్"

"వెంటనే రాలేను. తాపీగా సాయంత్రం వస్తాను. ఈలోగా ఆ సర్ ప్రైజేమిటో చెప్పేయకూడదు?"

"ఈ సంగీతజ్ఞానమూ - ధ్యానమూ లేకుంటే విధి నిర్వహణలో, ఈ పోలీసాఫీసరు ఏనాడో కఠినశిలగా మారిపోయేవాడు అని నిన్ను గురించి అనుకొంటూ వుంటారే, ఆ సంస్కారాన్ని, యోగాన్ని ప్రసాదించిన మన మాస్టారు ఇక్కడే, మా యింట్లో వున్నారిప్పుడు".

"మాస్టారా! వస్తున్నాను," ఫోన్ పెట్టేశాడు రాజశేఖరం.

రాజశేఖరం వచ్చేపాటికి, స్నానం ముగించి నేనూ తయారయ్యాను.

మాస్టారిని చూస్తూనే, తలపై వున్న హాట్‌ను తీసి, మాస్టారి పాదాలనంటి సాష్టాంగ నమస్కారం చేసాడు రాజశేఖరం.

"అయ్యయ్యో.... ఇదేమిటి?" అంటూ లేవదీసారు రాజశేఖరాన్ని.

"ఎన్నాళ్ళకు మాస్టారూ - " రాజశేఖరం కనులనిండా నీరు.

"ఇక్కడ ప్రభాకరం వుండటమే అదృష్టమనుకొన్నాను. అనుకోకుండా నీవూ కలిశావు. భగవంతుడు మిమ్మల్ని చూపాడనిపిస్తోంది నా ఈ కష్ట సమయంలో" అన్నారు మాస్టారు.

"ఏమయింది? చెప్పండి" అన్నాడు రాజశేఖరం.

"మా అబ్బాయి.. నానీ కనిపించడం లేదు" అన్నారు మాస్టారు. అలా అంటున్నప్పుడు మాస్టారి కంఠం రుద్ధమయింది.

"ఎప్పటి నుండి? ఎలా? కొంచెం వివరంగా చెప్పండి" ప్రశ్నించాడు రాజశేఖరం.

"వివరంగా చెపుతాను. మీకు తెలుసుగా, నానీ మాకు 'లేట్ చైల్డ్'. జానకి పోయాక నేను పుట్టి పెరిగిన వూరు, సాలూరు, వెళ్ళిపోయాను. మా అక్కగారు నిస్సంతు, విధవరాలు. ఆమెగారు వచ్చి మాతో ఉండిపోయింది. నా బాధ్యత, నాని బాధ్యత ఆమె నెత్తిన వేసికొంది. ఆమె ఎలా పెంచిందో; వాడెలా పెరిగాడో కూడా గమనించగల ధ్యాస లేదు నాకు నానీ గురించి.

"ఇంటర్‌మీడియట్ పూర్తి అయింది. యం.బి.బి.యస్. ఎంట్రన్సు పాసయ్యాడు. ఇక్కడ గుంటూరులో సీటిచ్చారు. హాస్టల్లో చేరాడు. రెండు నెలలకో సారి వచ్చి, తనకు కావాల్సిన డబ్బు తీసికొని వెళ్తూ వుండేవాడు. అలాంటిది ఏం జరిగిందో ఏమో అయిదారు నెలలుగా రావటం మానివేశాడు. డబ్బు మనియార్డరు పంపమని వ్రాస్తే అలానే చేస్తూ వచ్చాను.

"మా అక్కగారు అనేంతవరకు నాకు తోచిందే కాదు. వాడి దగ్గర నుండి గత మూడు మాసాలుగా జాబులే లేవు. క్రిందటి నెలలో వాడి తల్లి జానకి

పోయిన రోజు - ఆనాటికి రమ్మని వ్రాస్తే రాలేదు. జాబుకు జవాబు లేదు.

"మా అక్క కన్నీరెట్టుకొని నన్ను బయలుదేరతీసింది. వచ్చి కాలేజీలో వాకబు చేశాను. గత రెండు నెలలుగా కాలేజికి రావటం లేదు అన్నారు. హాస్టల్‌కి వెళ్ళాను. హాస్టల్లో రూము ఖాళీ చేశాట్ట. బయట ఎక్కడో వుంటున్నాడన్నారు. తిరిగి తిరిగి మూడు రోజులకు వాడుంటున్న రూము పట్టుకోగల్గాను. అది తాళం వేసి వుంది. గత మూడు రోజులుగా నేనున్న లాడ్జి నుండి ఆ గది చుట్టూ తిరుగుతూనే వున్నాను. అది అలా మూసేవుంది. వాడు కనిపిస్తాడనే ఆశ సన్నగిల్లుతోంది.

"నా మనస్సెందుకో కీడు శంకిస్తోంది! నిన్న ప్రొద్దుట పేపర్లో ప్రభాకరాన్ని గురించిన వార్త... ఫోటో చూచాను. ఏదో సహకార సంఘ ప్రారంభోత్సవ సభ తాలూకు వార్త అది. మన ప్రభాకరమే అనుకొన్నాను. వచ్చి కలిసాను. అలిసిపోయి వున్న ప్రభాకరానికి రాత్రి ఇదంతా చెప్పలేకపోయాను" - మాస్టారు చెప్పటం ముగించారు.

"నో వర్రీ మాస్టారూ! నానీని సాయంత్రం లోపల కలుసుకొని మీ ముందుంచు తాను" అన్నాడు రాజశేఖరం.

"నిన్ను చూచాక, ఆ ధైర్యం కలుగుతోంది. అవునూ, నానీని ఎప్పుడో చూచివుంటావు... గుర్తుపట్టకపోవచ్చు" అంటూ మాస్టారు తన సంచిలో నుండి, నానీ ఫోటో ఒకటి తీసి యిచ్చారు.

రాజశేఖరం ఆ ఫోటోను చూస్తూ కొన్ని క్షణాలలా వుండి పోయాడు. రాజశేఖరం మోములో లిప్త కాలం వెదలాడిన సంయాత్మకమైన మార్పు - చిన్న పాటి పరధ్యానం గమనించాను.

"మళ్ళీ కలుస్తాను మాస్టారూ" అంటూ సెలవు తీసుకొని వెళ్ళాడు రాజశేఖరం. రాజశేఖరం అంత త్వరగా వెళ్ళవలసిన పని వున్నదన్న విషయం నిజమైనా, వాడు కదిలిన తీరులో, ఏదో ప్రత్యేకత వుందనిపించింది.

"మాస్టారూ! ఇక అంతా రాజశేఖరం చూసుకొంటాడు. నిశ్చింతగా విశ్రాంతి తీసుకోండి" అన్నాను.

★ ★ ★

ఆఫీసు నుండి మధ్యాహ్నం రాజశేరానికి ఫోను చేసాను. మాచర్ల వెళ్ళాడని తెలిసింది. శ్రీగిరిపాడు మాచర్ల పరిధిలోనిదే! బహుశా ఆ గొడవ మీద మళ్ళీ వెళ్ళి వుంటాడనుకొన్నాను. నాని అచూకి, ఏ సబ్ ఇనెస్పెక్టరుకో అప్పగించి వుంటాడు. సాయంత్రం మరోసారి ఆఫీసు నుండే ఫోను చేసాను. ఇంకా రాలేదన్నారు. ఇంటికి తిరిగి రాగానే కళ్యాణిని అడిగాను మాస్టారు ఏం చేస్తున్నారని?, పైన మేడపై వున్నారంది.

బట్టలు మార్చుకొని పైకి వెళ్ళాను.

మాస్టారు బాల్కనీలో కూర్చొని ఏదో పుస్తకం చదువుకొంటున్నారు. నన్ను చూస్తూనే, "రాజశేఖరం నుండి కబురేదైనా వచ్చిందా?'' అని అడిగారు.

రాజశేఖరం మారచర్ల మరేదో మీద వెళ్ళాడని చెప్పలేకపోయాను. "ఆ పని మీదనే వున్నాడు. మీరు నిశ్చింతగా వుండండి" అని మస్టారికి ధైర్యం చెప్పాను.

"మనస్సెందుకో పరి పరి విధాల పోతోంది. ఏదీ, నీ వయొలిన్ ఒకసారి తీసికొనిరా'' అన్నారు మాస్టారు.

ఆ పోర్టికోపైనే కమ్ముకొస్తున్న ఆ చిరు చీకటుల మధ్య ఓ గంటసేపు వయొలిన్ వాయించాను. చివరిగా 'రఘువంశ సుధాంబుధి' వినిపించాను.

"నీవు సంగీతాన్ని మరచిపోలేదు. నాకు సంతోషంగా వుంది"

జానకి పైకి వచ్చి- "మీకు ఫోను" అంది. క్రిందికి వెళ్ళాను.

"ప్రభూ! ఓసారి వెంటనే వచ్చెయ్ - మాస్టారు వద్దు -'' ఫోనులో రాజశేఖరం.

"బంగ్లాకేగా... వస్తున్నాను".

★ ★ ★

"మాస్టారు ఫోటో చూపించినపుడే - మూడు రోజుల క్రిందట మాచర్ల చెంత నున్న కాకిరాల అడవుల్లో పట్టుబడ్డ ఉగ్రవాద ముఠాలోని 'రాంబాబే - నానీ' నా అని అనుమానం వచ్చింది."

"అవునా?'' భయంగా అడిగాను.

"నా అనుమానాన్ని రూఢిపరచుకోవటానికే, వెంటనే మాచర్ల వెళ్ళాను. అవును 'రాంబాబే'.... 'నాని'. కొత్తగా ఈ మధ్యే ఉగ్రవాద ముఠాలోకి రిక్రూట్ అయ్యాడు" అన్నాడు రాజశేఖరం.

మనస్సంతా వికలమయింది.

"నాని ఎక్కడున్నాడు... ప్రస్తుతం?"

"ఉగ్రవాద ముఠా దొరికిపోయిన వార్తను పత్రికలలో రాకుండా జాగ్రత్త పడ్డాము. ఈ మధ్యకాలంలో జరిగిన ఒక రైలు ప్రమాదానికి, మందుపాతరతో జీపును పేల్చివేసి పది మంది పోలీసుల మరణానికి కారణభూతమైన దుశ్చర్యకు ఈ ముఠాయే కారణం అని మా అనుమానం. ఇంటరాగేట్ చేయటం కోసం వాళ్ళను - మొత్తం ఏడుగుర్ని - ఒక రహస్య ప్రదేశంలో వుంచి, ఉగ్రవాద కార్యకలాపాలపై నిఘా కోసం నియమింపబడిన స్పెషల్ ఇంటలిజెన్సు టీముకు అప్పగించాము.

మాచర్ల వెళుతూనే ఆ డిప్యూటీ సూపరింటెండెంటును కలిసి, ఇంటరాగేషన్ సెల్‌లోకి వెళ్ళాను. ఫోటోలోని 'నాని'నే రాంబాబు. భీమవరంలో మనం చూచిన 'నాని'లో ఎంతటి మార్పున్నా, జానకమ్మగారి పోలికలు, ఆ ముక్కూ, ఆ చిత్రజుత్తును ఇట్టే పోల్చుకోగల్గాను. మరో గదిలోకి, ఒంటరిగా నానిని పిలిపించుకొని, గది తులుపులు మూయించి - 'నానీ' అంటూ అమాంతం కౌగలించుకొన్నాను.

మరో విడత ఇంటరాగేషన్‌కై హింసించబడడం కోసం సిద్ధపడి ఆ గదిలోకి వచ్చిన నాని, నా పరిష్వంగనంతో ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరి అయి నిశ్చేష్టితు డయ్యాడు.

ముసుగులా కప్పుకొన్న ఆ దుప్పటి పూర్తిగా జారిపోగా ఒక్క డ్రాయరుపై మిగిలిన నానీని అప్పుడు చూచాను. ఒళ్ళంతా ఎర్రటి రక్తపు చారికలతో కదుములు కట్టిన శరీరంతో - నానీ.

కఠిన శిలలా వుండే నాలోని పోలీసు గుండె కూడా ద్రవించింది. నా దగ్గరగా కూర్చోపెట్టుకొని తల నిమురుతూ వస్తోన్న కన్నీటిని అతి ప్రయత్నం మీద అపుకొంటూ - 'నానీ.... నేనయ్యా.... రాజశేఖరాన్ని' అని మాస్టారు, జానకమ్మగార్లతో నాకున్న అనుబంధాన్ని - తన బాల్యంలోని 'నన్ను' జ్ఞాపకం చేశాను.

గుర్తు చేసుకొన్నాడు- నాని.

"ఎందుకిలా దారి తప్పావయ్యా?" ప్రశ్నించాను.

"ఇది దారి తప్పటం కాదు. దారిని గుర్తించటం" చాలా దృఢంగా జవాబిచ్చాడు.

"అలా ఎందుకనుకొంటున్నావు?"

"నేననుకోవటం కాదు. కళ్లు, చెవులూ వుంటే... స్వార్థరహితంగా ఆలోచించగలిగితే ప్రతివారికి కన్పించేదదే. కళ్లు విప్పి చూడటానికి ప్రయత్నించండి. మీకూ కనిపిస్తుంది. చూడండి.... మన ముందున్న ఈ వ్యస్థను చూడండి.

"సమాజంలోని బలమైన ఒక వర్గం, జాతి సమిష్టి కృషిని కొల్లకొట్టుకొని, కొన్ని తరాల వరకు తరగని సంపదను పదిలపరచుకొంటూ, బలపడుతోంది..... మరోప్రక్క తర తరాలుగా కుల, మత, వర్గ విభజనలతో అణచివేతకు గురై దారిద్రంలోకి నెట్టి వేయబడుతోంది బడుగువర్గం. దేశస్వాతంత్ర్య ఫలితాలను బ్లాక్ మార్కెటీర్లు, భూస్వాములు, పెత్తందార్లు, బహుళ వ్యాపార సంస్థాధినేతలు వాటాలు వేసికొని పంచుకొంటుంటే, ఈ చట్టాలు, పోలీసు వ్యవస్థ, న్యాయస్థానాలు వారికి దాసోహం అంటూ సలాములు చేస్తున్నాయి. అసహాయులైన దళిత వర్గాలు నానాటికీ కూలీలై... భిక్షువులై, దారిద్రంతో, అనారోగ్యంతో - మనకింతే ప్రాప్తి అనే నిట్టూర్పుల మధ్య కూలిపోతున్నారు. ఇది దోపిడీ వ్యవస్థ. దీనిని విధ్వంసం చేయాల్సిందే."

చాలా ఆవేశంగా మాట్లాడాడు నాని. ఆ క్షణాన ఏం మాట్లాడినా లాభం లేదనిపించింది.

★ ★ ★

"ఆ స్పెషల్ ఇంటిలిజెన్సు బృందం నా నేతృత్వంలోనే పనిచేస్తోంది. నా పర్సనల్ ఇంటరాగేషనుకంటూ నానీని తీసికొని వచ్చేశాను" అన్నాడు రాజశేఖరం.

"నాని ఎక్కడ?"

నేను, రాజశేఖరం పైన గదిలో వున్న నాని దగ్గరకు వెళ్లాం.

"నానీ! గుర్తుందా... ప్రభాకరం. మాస్టారి దగ్గర వయొలిన్ నేర్చుకొంటూ వుండేవాడు" అని నన్ను పరిచయం చేసాడు రాజశేఖరం.

నన్ను గుర్తు పట్టలేకపోయాడు. కానీ నానిని నేను పోల్చుకోగల్గాను.

రాజశేఖరమే మళ్ళీ మాట్లాడాడు.

"ప్రొద్దున నువ్వు మాట్లాడినదంతా నిజమే! ఒప్పుకొంటున్నాను. ఈ వ్యవస్థను మార్చవలసిందే - ఈ దోపిడిని అరికట్టవలసిందే. కాని అందుకోసం మీరనుకొంటున్న - అనుసరిస్తోన్న మార్గం సరైనది కాదు - బలిసిన ఈ దుర్వ్యవస్థను ఎదుర్కొనటానికి, సాటి అయినది కాదు మీ పంథా."

సోఫాలో కూర్చొని వున్న నాని చాలా ఆవేశంగా రియాక్టయ్యాడు.

"ఎందుకు కాదు?"

"అదే చెపుతాను. కొంచెం ఆవేశాన్ని ప్రక్కకు పెట్టి విను! ఈ వ్యవస్థను ఎదుర్కొనటానికి మీరేం చేస్తున్నారు? చట్టాన్ని చేతులలోనికి తీసికొంటున్నారు. ఈ వ్యవస్థే తప్పుడుదనుకొంటున్న మీరు దాని తాలూకు చట్టాన్ని గుర్తించక పోవటం న్యాయమే! కాదనటం లేదు. కాని దాని వలన సాధిస్తున్నదేమిటి? అని. ఈ వ్యవస్థ ప్రతినిధులను ఒకరినో, ఇద్దరినో చంపినంత మాత్రాన ఒరిగేదేమిటి....? చంపవలసినది ఈ వ్యవస్థ తత్వాన్ని... ఎవరినో కిడ్నాప్‌చేసి, దొరికిపోయిన మీవారిని ఒకరినో, ఇద్దరినో విడుదల చేయించుకోవటమే విజయం అనుకొంటు న్నారు మీరు. కాని, మీకు తెలియకుండా, ప్రభుత్వానికి మానవత్వాన్ని అంటగడు తున్నారు. రైళ్ళను పడవేసి బస్సులను ప్రేలిక్చ వేసి మీరు సాధిస్తున్నదేమిటి? ప్రజా నష్టం. సామాన్యుల సానుభూతిని కోల్పోతున్నారు అంతే!

"దగాపడిన తమ్ముళ్ళకోసం - పసివాడని మొగ్గలుగా బయటకొచ్చిన మీరు. మీ అనాలోచిత చర్యలతో, నలిగిపోతున్నారు. తరిగి పోతున్నారు. చివరకు ఎవరి కోసం మీరీ వర్గపోరాటం జరుపుతున్నారో వారికి 'కరవై' పోతున్నారు. బలమైన ఈ పైశాచిక శత్రువుపై - బలహీనమైన ఈ పోరాటం అర్థరహితమైంది. మీ ఆశయం గొప్పదే! అనుసరిస్తున్న పంథా మాత్రం అస్తవ్యస్తమైంది. అనాలోచిత మైంది అంటాను."

నాని రాజశేఖరం కేసి అదోలా చూసి -

"అయితే, దీన్నంతా సహిస్తూ వూరు కోవాల్సిందేనంటారా?" ప్రశ్నించాడు.

"అని నేననను. అసలీ దుర్వ్యవస్థ మన జాతి జీవనంలోకి ఎలా కాళ్ళూని బలపడిందో ఆలోచించటం ప్రారంభించాలి. మనుషులలో, ఇంతటి స్వార్థచింతన ఎందుకు పేరుకుపోయిందో, సమాజం ఇంతగా ఎందుకు పతనమయిందో, ఆలోచించగలిగితే పరిష్కార మార్గముం దొరుకుతుందంటాను."

నానీ ఏదో చెప్పటానికి ప్రయత్నించబోయి ఆవేశాన్ని అదుపులో పెట్టుకొంటూ, ఆగిపోయాడు.

"నానీ! ఈ దోపిడికే కాదు.... ఈ జాతికి అంటుకొన్న సర్వ రుగ్మతలకు కారణం - అవిద్య. మనం ఎంతో గొప్పవి అనుకుంటూ, నేర్చుకొంటున్నామే చదువులు - అని చదువులే కావు. గతంలోకి తొంగిచూస్తే, మన జాతి ఒకనాడు ఎంతటి గొప్ప అంతస్సౌందర్యాన్ని సంతరించుకొన్న 'చదువులు' చదువుకొందో తెలుస్తుంది మనకు. మన మేధస్సుకు పదును పెట్టిన చదువులవి. పదార్థ విజ్ఞానాన్ని, ఖగోళ శాస్త్ర పరిజ్ఞానాన్ని, సాంఘిక జీవనాన్ని బోధించిన స్మృతులను, ఉపనిషత్తులను సాధించుకొన్నాం. అత్యుత్తమ సాహిత్యాన్ని సృష్టించుకొన్నా మానాడు. ఆనాటి చదువు సమ సమాజ నిర్మాణానికి, జాతి సమైక్యతకు దోహద పడింది. ప్రపంచం మొత్తం ఈ భారతావనికేసే సర్వ విజ్ఞానం కోసం ఎదురు చూసిందానాడు.

"కాని, ఆ సంపదను ఎలా చేజార్చుకొన్నామో... చేజార్చుకొన్నాం. విదేశీ భావనలకు మనలను మనం అర్పించుకొన్నాం. అనుకరణలకు బానిసలయ్యాం. స్వార్థం, అనైక్యత, కుల, మత విభజనలకు మనలను మనమే బలి చేసికోవటం ప్రారంభించాము. చివరకు ఈ అస్తవ్యస్త వ్యవస్థ సుడిగుండంలో చిక్కుకొని మిగిలిపోయాము. ఒకనాడు తల్లి ఒడి ఓ ప్రాథమిక విద్యాయలం, తండ్రి ఓ ఆదర్శ శిక్షకుడు. గురువు ఒక విజ్ఞాన సర్వస్వ భాండాగారం.

"ఏరీ? ఆ తల్లీ, తండ్రి, ఆ గురువు ఏరీ? అందరినీ కోల్పోయాం! నేను నీకొక ఉపన్యాసం యిస్తున్నాననుకోకు. పదిహేను సంవత్సరాలు పోలీసాఫీసరుగా ఎంతో సమాజాన్ని చూచాను. దానిలోని చీకటి కోణాలను, ఎగుడు దిగుడులను చూచాను. మనం మనలనెక్కడ తప్పుదారి పట్టించుకొంటున్నామో అర్థం చేసికోవటానికి ప్రయత్నించాను.

"ప్రతి దానికి మనం సమాజాన్ని నిందించటం నేర్చుకొన్నాం. సమాజం అంటే ఏమిటి? మనందరి మంచి, చెడ్డలే.... ఈ సమాజ ఆకృతి... కాదా!

"ఎవరి ఆత్మసాక్షికి వారే బాధ్యత వహిస్తూ విధి నిర్వహణ చేయాలి. పోలీసాఫీసరుగా నేను, వైద్య విద్యార్థిగా నీవు, ఉపాధ్యాయునిగా మరొకరు - అలా ఎవరికి వారు తమ కర్తవ్యాన్ని బాధ్యతలను, విధి నిర్వహణలను స్వార్థరహితంగా నిర్వర్తించగలిగితే, సమాజం దానంతటదే చక్కడుతుంది. చూడడానికి ఈ పరిష్కారం చాలా బలహీనంగా కన్పించవచ్చు. కానీ, ఒక్కొక్క వ్యక్తే, మరొకరితో ప్రమేయం లేకుండా, ఇలా ఆలోచించి, ఆచరించగలిగితే అదొక ఉద్యమమై ఆ ఉద్యమం పురి చుట్టుకొని, ఒక మహోద్యమమై జాతి సూత్రమై, ఈ జాతిని, దేశాన్ని నిలబెడుతుంది. అలా జరగాలంటే మనకు, మన ముందు తరాలకు సరైన చదువు కావాలి. జాతీయతను, జాతి సంస్కృతిని చాటి చెప్పే చదువు కావాలి - '' రాజశేఖరం ముగించాడు.

ఆ ఓక్షణాన రాజశేఖరం ఒక పోలీసాఫీసరుగా, నా చిరకాల మిత్రుడుగా కాదు - ఒక ప్రవక్తలా కన్పించాడు నాకు.

నాని, తనముందో మహాకాంతి పుంజం పురివిప్పుకోగా - దానినే సంభ్రమాశ్చర్యాలతో, అనిమిషుడై చూస్తున్నట్లు వుండిపోయాడు.

★ ★ ★

తెల్లవారుజామున నేనూ, రాజశేఖరం, మూడున్నర గంటల ఎక్స్‌ప్రెస్‌కు మాస్టారిని, నానీని ఎక్కించటానికి రైల్వే స్టేషను కొచ్చాం.

"మాస్టారూ! నానీ, వాళ్ళ అత్తయ్యగారితో రెండు రోజులు గడిపాక తిరిగి వచ్చి నా దగ్గరే వుండి చదువు సాగిస్తాడు'' అన్నాడు రాజశేఖరం.

నానీ, మాస్టారు కంపార్ట్‌మెంటులోకి ఎక్కి తమ సీట్లలో సర్దుకొంటున్నారు. నేనూ, రాజశేఖరం ప్లాట్‌ఫారం మీద వున్నాం.

"నానీ మీద ఎలాంటి కేసు నమోదు కానట్లేనా?'' ప్రశ్నించాను.

"లేదు. నానీ ఆ ముఠాలోకి కొత్తగా రిక్రూట్ అయ్యాడు. అంతే! ఎలాంటి

నేరమూ చేయకముందే దొరికిపోయాడు. అందుకే నా పూచీ మీద విడుదల చేయించాను'' అన్నాడు రాజశేఖరం.

మాస్టారు ప్లాట్ ఫారం మీదికి దిగి వచ్చి, మా యిద్దరి మధ్యగా నిలబడి, మా భుజాలపై తన చేతులుంచి కౌగిలించుకొంటూ దగ్గరకు తీసుకొని -

"విద్య యశస్సు... భోగకరి... విదేశి బంధుడున్ అన్నారు. నేను మీకే మాత్రం విద్య నేర్పానో నాకు తెలియదు. కానీ ఈ కాని ప్రాంతాన మీరు బంధువులే కాదు - సర్వస్వమూ అయి నాకు నానీని దక్కించారు.''

ఆయన కంఠం రుద్ధమై ఆపై పెగలలేదు. మేస్టారి కనులలో ఆనందాశ్రువులు.

నానీని మాస్టారిని తీసికొని రైలు కదిలింది.

★ ★ ★

ఎవరి ఆత్మసాక్షికి వారే బాధ్యత వహిస్తూ విధి నిర్వహణ చేయాలి అని రాజశేఖరం అన్నమాటలు చెవులలో రింగు మంటూ వుండగా-

"ఆ భూములు దళితులవే...'' అంటూ శ్రీగిరిపాడు రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాను. ●

## కథ వెనుక కథ :

*1991 దీపావళి కథల ప్రత్యేక సంచికకు కథవ్రాయమని కోరారు 'జాగృతి' సంపాదకులు.*

*దేశంలోని సర్వ రుగ్మతలకి ఒకరు మరొకరిని నిందిస్తున్న నేటి స్థితిగతులను, ప్రేరణగా తీసికొని, పరిష్కారం ఇలా వుంటే'' అని వ్రాసిన కథ.*

*కథకు శ్రీ బాపుగారు గీచిన బొమ్మ అత్యద్భుతం!*

★ *(జాగృతి, దీపావళి 1991)* ★